# కలిగినవాడిగాదెతీసేసరికి పేదవాడిప్రాణాలు పోతాయి!

# పాలేరు వెంకడు

"చేతులో మందుపాట్లం వెళ్ళి ఎండి
పోయిన గంజిగుంటలో పడింది.
కొట్టుకుపోయిన వెంకడి మోచేతి
నుండి రక్తబిందువు చెదరి రత్తి
పెదిమల మీద పడింది."

రచయిత :

## పి. శివరామమ్

౧

"ఒరేయి వెంకడూ! ఆవుని దొడ్లో కట్టెయ్యి."

* * *

"వెంకా! బజారుకు పోయి నాకో లబ్బరుబంతి తెచ్చిపెట్టవురా?"

* * *

"నాయినా! ఒరేయి, వెంకడ్ని పంపి ఓఅణా పళ్లు తెప్పించవుట్రా. శుక్రవారం. గుళ్లోకి పోవాలి.

* * *

"వెంక డేడండీ? అప్పలస్వామి అరటికాయలు పంపిస్తానన్నాడు. ఇంకా పంపలేదు. ఎంటవేళయింది. వెళ్ళి పట్టుకు రమ్మనకూడదూ?"

* * *

వీధులో ఊంర్చున్న పాలేరు వెంకడు కరణంగారి కేకకు లేచి ఆవుని శాలలోకి మళ్ళిస్తూ చిన్నమ్మాయి కోరికకు 'అల్లాగే' నని తలూపి గేటుదాకా వెళ్లాడు.

ఇంతలో కరణంగారి తల్లి పురమాయింపూ, వెంటనే అమ్మగారి సాధింపూ వినబడ్డాయి.

నిమిషం తీరికలేదు. ప్రొద్దున్నే గంజిత్రాగి వచ్చాడు. మధ్యాహ్నం యింటికి పోదాం- రెండు రోజులనుంచి జ్వరంతో పడుంది పెళ్ళాం- మందేమిటో మాకేమిటో చూద్దా మనుకుంటే- తెమిలితేనా ? యిరవై నాలుగ్గంటలూ పనే.

అవసర మెల్లాగున్నా ప్రత్యేకం వెంకడిచేత పని చేయించేందుకైనా మరొక నాల్గుగంటలు ఎక్కువయితే బాగుండు నని ఆలోచిస్తా వుంటాడు పంతులు—

* * *

వెంకడి తాత, తండ్రికూడా కరణంగారి దగ్గిరే పనిచేశారు. వెంకడితాత సుబ్బడు ఆజానుబాహుడూ, మంచి నమ్మకమైన వాడూను.

రామప్పంతులు కరిణీకం చేత పుచ్చుకునేటప్పటికి యిరవై యేళ్ళ యువకుడు. వూరంతా పార్టీలతోటీ, కక్షలతోటీ నిండి వుండేది. "బాబుగారి యినయంలో ఎవళ్ళయినా చరే అన్నేయం తలపెట్టేరంటే నారత్తంకూడా ధారపోత్తా" ననేవాడు సుబ్బడు. ఆపభై యేళ్ళ వయస్సులో వాడు యెదుటి పార్టీకి యముడయ్యాడు. పంతులుని నీడలాగ వెంబడించేవాడు. చివరికి పార్టీగొడవల్లో పడి పాపం రాత్రికి రాత్రి గొడ్డలిదెబ్బలు తిని చచ్చిపోయాడు.

సుబ్బడుకొడుకు రాజియ్యకూడా మహానమ్మకంతో వుండేవాడు. కరణంగారి కొలువు ఆట్టేరోజులు చేసే అదృష్టం లేకపోయింది రాజియ్యకు దొడ్లో పురుగూదితే చచ్చిపోయాడు-

అప్పటికి వెంకడికి పధ్నాలుగేళ్ళుంటాయి. అప్పట్లో ఆదిక్కూ లేని కుటుంబంమీద సానుభూతి కనబర్చడం రామప్పంతులు తన విధి అనుకున్నాడు.

వెంకడ్కి నెలకి ఒకరూపాయి సాదరుఖర్చు కిస్తానని చెప్పి సంవత్సరానికి రెండుబస్తాలు ధాన్యానికి పనికి కుదిర్చాడు.

ఈ యిరవై యేళ్ళుగా తండ్రి తాతల పేరు నిలబెట్టాడు పాలేరు వెంకడు. కరణంగారే పెళ్ళిచేశారని అందరితోటీ చెప్పుకునేవాడు వాడు——నిజానికి సాటికులంలోని రత్తిని తనే చూసుకుని స్వయంగా మాట్లాడుకుని చేసుకున్నప్పటికీని.

ఇంట్లో కరణంబాబు మొదలుకుని చిట్టిబాబుగారి వరకూ ఎవరేంచెప్పినా సరే విసుక్కోకుండా ఏపనైనా సరే చెయ్యడానికి సిద్ధమవుతూ వుండేవాడు.

* * *

ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత- సంసారకూపంలో పడి నలిగిన తర్వాత ఆ గంజి మీద- నూకల కూడు మీద ఆధారపడున్న-బక్క పేగుల జీవం- యిదివరకంత చురుకుగా పనిచేయడం లేదని అంతా విసుగుకుంటే మాత్రం ఏం లాభం? అక్కడికీ ఒక్క నిముషమయినా వూరికే కూర్చోకుండా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనేవుంటాడు-

ఇంట్లో ఒక పనయిన తర్వాత మరొకటి గాదామె! కరణంబాబు పని చెప్పిన సమయానికే ముసలమ్మగా రేదో చెబుతుంది. వినకపోతే ఆవిడ నానామాటలూ అని "ఆఖరికి పాలేరువెధవకూడా యీ ముసిల్ది చెప్పడమేం! నేను వింటమేం? అనే పట్టుంటే- నేనెందుకూ'' అని సాగదీసుకుంటూ మాట్లాడుతుంది.

ఇంతలో అమ్మగారు వచ్చి ఏదో పురమాయిస్తారు. చెయ్యలేకపోతే ఛీవాట్లు.

బయటికి కదుల్దామంటే బుల్లమ్మాయిగారు వచ్చి ఏమిటేమిటో చెబుతుంది. యిల్లా గడుపుతున్నాడు జీవితం- వెంకడు.

"బాబుగారూ! ఆ రయింది గడియారం కొడితే యిన్నా. యింక ఇంటికి కెల్తానండి, బాబయ్యా!'' అన్నాడు అరుగుక్రింద నిలబడి వెంకడు.

"దూడకు గడ్డేశావా? అవుకు చిట్టూ——''

"అన్నీ శేసానండయ్యగారూ! పొద్దున్నే ఒచ్చానండి. యింటికాడది లేవడం లేదండి బాబుగారూ! లంకణాలుండి. పిల్లలకి గంజోసే దిక్కునేదు. బేగే ఎల్లాలుండి'' అన్నాడు ఎంతో ఆత్రంతో- ఆ వేదనతో-

"వెంకా! పూజారి కామయ్యను గుడితాళంచెవులు తీసుకుని వెంటనే రమ్మని చెప్పు'' అని తలుపు వెనకనుంచి కేకేశింది కరణంగారి భార్య.

"సెప్పి అక్కణ్ణుంచి ఇంటికెల్తానండయ్యగోరు.''

"ఊఁ-'' అన్నాడు కరణం బాబు.

వెంకడు ఒక్కసారి ఊపిరి ఘట్టిగా పీల్చి గబగబా నడవడం మొదలెట్టాడు. యిరవై అడుగులేసేసరికి "వెంకా! ఒరేయి!'' అని కేక వినబడింది.

గుండె జారిపోయింది వెంకడికి. యింటికి వెళ్ళాలని ఎంత తొందర పడుతున్నాడో- యింట్లో పెళ్ళాం పిల్లలకోసం ఎంత ఆదుర్దా పడుతున్నాడో అంత ఆలస్యమైపోతోంది.

గబగబా వెనక్కి పరుగెత్తుకొచ్చాడు. "ఒరేయి! నాయుడుగారి కృష్ణారావు నోసారి నేరమ్మన్నానని చెప్పు'' అన్నాడు అరుగు మీద నిలబడి పంతులు.

"సిత్తం, బాబయ్యా!'' అని పరుగెత్తేడు వెంకడు.

అప్పటి కారున్నరయింది. పూజారింటి కెళ్ళాలి; నాయుడుగారింటి కెళ్ళాలి.

ప్రొద్దు న్నొచ్చాడు. పెళ్ళాని కెల్లా వుందో? పిల్లలు ఆకలని ఎంత మాడిపోతున్నారో? యిదే ఖంగారు వెంకడికి.

౨

"అయ్యా! మొక్కజొన్నేదిరా? తెత్తానని సెప్పినావు'' అంటూ వెనకాలే నిలబడ్డాడు పెద్ద కొడుకు అయిదేళ్ళవాడు.

కాళ్ళూ మొహం కడుక్కుంటూన్న వెంకడు వెనక్కి తిరిగి "మీ అమ్మ కెల్లా గుందిరా? యీపూట లేసిందా?'' అన్నాడు.

తండ్రిమాట వినపడగానే గుడి

సెలోంచి వెంకడికూతురు మూడేళ్ళది మెల్లిగా బయటకొచ్చి "అయ్యో! అయ్యో!" అంటూ కాళ్ళకు చుట్టేసింది.

దాన్నెత్తుకుని లోపలకొచ్చి చింకిచాపమీద పడుకున్న రత్తి తలదగ్గిర కూర్చున్నాడు వెంకడు.

"ఎల్లాగుందే?"

"శానా నిత్రాణగా వుంది. పిల్లదాని కొంత నూకలజావ యీరయ్యమామిత్తే పోశాను. గుంటగాడికింతవరకూ కూడు లేదు" అంది రత్తి హీనస్వరంతో.

ఏడాది పిల్లాడు వెంకడి రెండో కొడుకు తండ్రివైపు తిర్గి చేతులు జాపాడు. రత్తిప్రక్కలోంచి వాడ్ని తీసుకుని ముద్దుపెట్టుకుని "యిప్పుడు కొంత నూక లుడికించి పెడ్తా" నన్నాడు వెంకడు పెళ్ళాం కళ్లల్లోకి చూస్తూను.

"ఏం? కూసిని బియ్యం నుడిగి పట్రాకపోయినావ్ పంతులుబాబింట్లో" అంది రత్తి.

వెంకడు తెల్లబోయాడు. యింట్లో ఒక్క గింజయినా లేదు. కాసిని నూకలుంటే ప్రొద్దున్న తను నూకలజావ కాచుకుని త్రాగాడు. సందెకాడ వొచ్చేటప్పుడు కరణం బాబు నడిగి తెద్దా మనుకున్నాడు. కాని ప్రొద్దుగూకేసరికి పగలల్లా పనిచేసి చేసి వుండి అలిసిపోయిన మీదట- ఎప్పు డిక్కడ నుంచి విడుదలై పోతానా అని వుండి పెళ్లాంమీది ధ్యాసచే పరుగెత్తుకొచ్చాడే కాని తిండాని కింట్లో నూకల్లేవే నని యోచించే వ్యవధి లేకపోయింది వెంకడికి.

కాస్సే పాలోచించాడు.

"ఒసే పిల్లా! నే కరణంబాబింటికెల్లి అరగంటంగో ఒత్తా." అని చెప్పి పరుగెత్తాడు. మాలగూడెం నుంచి అరమైలుదూరం- ఆ చీకట్లో డొంకల్లోంచి పడి పోవాలి కరణ మింటికి.

* * *

ఆరోజు గడిచింది.

## 3

తెల్లవారింది- రోజూకన్న గంటముందుగా వెళ్లాడు వెంకడు కరణ మింటికి "హారేయి! వెంకా, యివేళ చిట్టమ్మాయిగారూ, పిల్లలూ వస్తున్నారు. స్టేషన్‌కి బళ్ళు కట్టించు కెళ్ళాలి." అన్నాడు సావిట్లో చుట్టకాలుస్తూ కూర్చున్న కరణం.

"బాబుగారూ! యింటికాడ సచ్చేపాణంగా వుందండి దానిగతి. పిల్లగాళ్లూరికే ఏడుత్తుండారుండి. యివ్యేళ శెలవిప్పిత్తారని కర్చుకేమైనా ఓరూపాయి దయిసేయిత్తారనీ వచ్చానుండి" అన్నాడు చేతులు జోడించి వెంకడు.

కరణం మొహం చిట్లించి "మరి బళ్లు తీసుకుని స్టేషన్‌కెవ రెళ్తారు నీబాబు!" అన్నాడు.

వెంకడికీమాట చాలా కష్టం తోచింది. "సచ్చిన నాబాబు చంగతెందుకండీ- ఏమీ పనిసేయక కూర్చుంటాడు తాతిగాడ్ని—"

"నోర్ముయ్యి. వొకళ్ళమీద అజమాయిషీకి పెట్టాననుకున్నావా నిన్ను? పొగరెక్కి మాట్లాడుతున్నావు."

"సమించండయ్యాగోరూ! నా పెళ్ళానికి పాణంమీద కొచ్చిందుండి- అందుకోచమని యింత ఏడుకుంటున్నా యివ్యేల్టికి—"

"నీ పెళ్లానికి జ్వరమయితే యీ వేళ అమ్మాయిని రావద్దంటావుట్రా! నీ తీరుబడి చూసుకుని బయల్దేరవలశిం దన్నమాట ప్రయాణాలు వోరి—" అంటూ నోరు నొక్కుకుంది కరణంతల్లి.

"హారేయి నాయుడుగారిబండీ, మనబండీ గూళ్లు కట్టించి తోలించుకుని—"

"బాబుగారూ! ఎవళ్ళనయినా పంపించండి. నే నివ్యేల కింటికాడికి పోవల్సిందే. పిల్లల కొండిపెట్టే దిక్కు నేను. అది రోగంతో సత్తావుంది" అన్నాడు కళ్ళవెంబడి నీరు కాగుస్తూను.

"ఏడాది కోపిల్లాడ్ని కంటూ- దరిద్రమో- తినడానికి కూడో- అంటూ- అరుపు లేస్తారు యీ వెధవ అల్క్కజాతి- అల్లా పొర్లి- కని పోసి- యింటిసిండా పిల్లలతోటి దరిద్ర మనుభవించడమేమో?" అని సాగదీసుకుంది- ముసిలావిడ.

"హారేయి ఎవళ్ళూ లేరు. తప్పదు. నువ్వువెళ్ళి అమ్మాయిగార్ని

బళ్లెక్కించి కావలిస్తే అక్కడినుంచింటికి ఫో'' అన్నాడు పంతులు.

గ్రుడ్ల నీరు క్రుక్కుకుంటూ "నే నెల్ల లేనుండీ- దానికి——'' అని యింక మాటాడలేక గిఱ్ఱున తిర్గి వెళ్ళిపోయాడు వెంకడు.

౪

వెంకడు కొంపకు జేరే టప్పటికి పెద్దకుఱ్ఱాడు వీధులో ఏడుస్తూ నిలబడి వున్నాడు. కుఱ్ఱది గుమ్మందగ్గిర కూర్చుని తల్లివంక చూస్తోంది. ఆత్రుతగా వెంకడు లోపలికి వచ్చాడు. రత్తి వూరికే ఆయాస పడ్తూవుంది. ఎగూపిరీ, దిగూపిరీ గా వుంది-

"రత్తీ!'' అన్నాడు వెంకడు. ఆపిలుపులో ఎన్ని శ్రుతులు? ఎన్ని రాగాలు మేళవించున్నాయో ఆ భగవానుడికే తెలుసు.

ఆయాసంతో కళ్ళు తెరిచింది రత్తి. వెంకడిచెయ్యి పట్టుకుంది. "పిల్లాడు ఏడుస్తున్నాడు. పిలవండి'' అంది ఆయాసంతో. లోపలికి వచ్చిన కొడుకుని దగ్గిరిగా తీసుకున్నాడు. వా డింకా ఏడుపు మానలేదు.

కుఱ్ఱది అన్నను చూసి తనూరుకోడ మెందుకని మెల్లిగా మంధరస్థాయిలోనుంచి ప్రారంభించి శ్రుతిలో కలిపింది :

ప్రక్కలో కుఱ్ఱాడు వీళ్ళఏడ్పు విని కెవ్వు మన్నాడు.

"రత్తీ! పూజారి కామయ్య డబ్బిస్తేనే కానీ మం దివ్వనన్నాడు. కరణంకాడ్కి పోతే పనిసెయ్యి మని చెప్తాడు.''

రత్తి వూరికే ఆయాసపడ్తూ అతికష్టంతో కళ్లు తెరుస్తోంది. ఏదో బాధ- యాతన——

పిల్లలకు ఆకలి- అందులో అమ్మ పల్కదని మరీ ఏడుపు.

వెంకడి కేమీ తోచదు.

కామయ్య- మాత్రయిస్తే ప్రయోజన ముందని తనకు తెలుసు. కాని డబ్బు ఇవ్వందే చస్తే మం దివ్వనన్నాడు పూజారి. ఇం కేందోవ? పోనీ వొకరూపాయి- ఆఖరికి అర్థరూపాయైనా యిస్తాడేమో పంతు లంటే- ఊహు- స్టేషన్ కు వెళ్ళ మంటాడు. ఇంటిదగ్గిర చచ్చే ప్రాణంగా వున్నా సరే. పాషాణ హృదయాలు-మళ్ళీ ఖామందులు-

తను పాలేరు- వెట్టి వెధవ-

* * *

ఆలోచించడాని కవకాశం ఏదీ?

ఆకలితోటి డొక్క లెగరేసుకుంటూ వూరికే ఏడుస్తున్నారు పిల్లలు- కన్ను తెరవడాని కోపిక లేకుండా ఆయాసంతోటి రత్తి-

ఆలోచించాడు వెంకడు- 'మళ్ళీ వొక్కసారి కామయ్యదగ్గిర కెళ్లి బ్రతిమాలుకుంటే-' పిల్లల ఏడుపుకూడా వినిపించుకోకుండా పరుగెత్తాడు బయటికి-

౫

'బాబయ్యా!'

* * *

'శాత్తులుగోరూ!'

* * *

'బాబుగోరూ- అయ్యా!'-

'ఏరా! చెవికోసిన మేకలాగ అల్లా అరుస్తా వెందుకూ?'

'బాబుగారూ! నా పెల్లాని కాయాసం యెక్కువయిందుండి. వూపిరికూడా యెగనాక లేకుండా వుందయ్యా! మం దిచ్చారంటే బతుకుతుంది. దణ్ణా లెడ్తానుండి.'

'ఇవ్వ నన్నానుట్రా ! ఒక్క మాత్రకి రెండురూపాయలు తీసుకోవలశిందే. దేవీప్రసాదితమైన ఔషధం- బీదవాడివని కనికరంతో- రూపాయి ఇమ్మన్నాను. ఎంత దయాహృదయంతో- ఆ- సరే- ఇల్లా గిరవా పెయ్యి.'

'అయ్యగోరూ! ఎంత సచ్చినా డబ్బు దొరకనేదండీ. ఏం చేసేది? కరణంబాబు నడిగితే ఆయనగోరేదో పని శెప్పారుండి. ఏడకో పోయిరావా లుంటండి. జాంపొద్దెక్కుతా దొచ్చాటప్పటిక్కి. అప్పటిక్కి యింటిదాని పాణా లుంటాయో, వూడతాయో! బాబుగారూ! తమపేరు తల్చుకుంటా మండీ తరతరాలు- మద్దాన్నపే లట్టుకొచ్చి డబ్బు దాఖలు సేసుకుంటా యిప్పుడు మందు దయసేయించుండి - ఎల్లాగైనా—'

'నీతాత సొమ్మేమైనా దాచ పెట్టావుట్రా యిక్కడ?- అసలు తెల్లనాణాన్ని దేవీవిగ్రహంముందు పెట్టందీ మందుపెట్టి ముట్టుకునేందుకు- హమ్మయ్యో- దేవీద్రో

హం చెయ్యి మంటావుట్రా? పశువా! వీల్లేదు. మధ్యాహ్నమే రా- ఇంతలో ఏమీ ఫర్వాలేదు- మునిగిపోలేదు'' అని వెనక్కి తిరిగాడు పూజారి కామయ్య.

'బాబుగారూ! బాబూ : యిన్నపం యినండి, తమకడుపున బుట్టి—'

'ఛా, మాలపీనుగా- నోర్మూయ్యి, ఉచ్ఛనీచాలు తెలియక పేల్తావ్' అని తలుపు, భఢేలున వేశాడు కామయ్య.

ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకొని సందు చివరదాకా వెళ్ళాడు వెంకడు. పరుగెత్తుకు వచ్చాడు గూడెం నుంచి. రాత్రి పంతు లింటినుంచి తెచ్చిన కూకలు పిల్లల కొండిపెట్టి తను బెంగతో ఏమీ తినకుండా రత్తిప్రక్కనే జాగరణ చేశాడు. ప్రొద్దుటినుంచి తిరగడంగా వుంది. లోపల దిగులు-

ఎదురుగా తాతిగా డొస్తున్నాడు. 'ఏరా యెంకా! బళ్ళొచ్చి గుమ్మంకా డున్నాయి. తోలించు కెళ్ళి అమ్మాయిగోర్ని తీసుకు రా గూడదంట్రా' అన్నాడు.

వెంకడు తలెత్తి చూశాడు. పోనీ తాతిగాడు చెప్పినట్లు చేద్దామా అనిపించింది. అయితే పన్నెండు గంటల వరకూ తిర్గి రాలేదు.




# టి. సి. యెన్.

ఆభరణాలంకారపుటందాన్ని తెలుపడానికి అద్దమేల?

## మెడ చెయినులు

2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను, బంగారు చెయినుల కేమాత్రము తీసిపోవు. వలుపెక్కువు.

| పెద్ద సైజు | | చిన్న సైజు | |
|---|---|---|---|
| 1 పేట 1-కి రూ. | 7-0-0 | 1 పేట 1-కి రూ. | 5-0-0 |
| 2 పేటలు ,, | 14-0-0 | 2 పేటలు ,, | 10-0-0 |
| 3 పేటలు ,, | 21-0-0 | వి. పి. ఖర్చులు | 0-8-0 |
| 4 పేటలు ,, | 28-0-0 | | |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

## టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్‌టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు:—గుప్తా అండ్ కో, మెయిన్ రోడ్, కాకినాడ.


అప్పటికి రత్తి గ తేంగాను? పిల్లలు మాడిపోరూ?

మరి వేరే గత్యంతరం లేదు-

కరణంబాబు గుమ్మంముందు నిలబడి వున్నాడు. వెంకడ్ని చూడగానే 'ఏరా? వెడ్తావా?' అన్నాడు-

'సిత్తం. బాబయ్యా! ఒక్కరూపాయి దయసేయించుండి బాబుగారూ!' అని కళ్ళనీళ్లు తుడుచుకున్నాడు.

కరణం లోపలి కెళ్ళివచ్చి 'త్వరగా బళ్లు తోలించు కెళ్లు. రాగానే యిస్తాను. నాదగ్గి రేమీ చిల్లర లేదు. కోమటి శేషయ్యకైనా చీటీ రాసిస్తానులే- వచ్చిన తర్వాత' అన్నాడు.

వెంక డొక్క నిట్టూర్పు విడిచాడు. తనయందు- యిన్నిసంవత్సరాలు నమ్మకంతో కొలుస్తూ వున్న తనమీద అపనమ్మకం- రూపాయి తీసుకుని వెళ్ళక—యింటికి పోతాడేమో ననే—సంకుచితాభిప్రాయం.

వెంకడు చిన్నబుచ్చుకున్నాడు యీ ఆలోచన తట్టగానే—

వెనక్కి తిర్గి ఎడ్లముందుకు పోయి ముకుతాడు పుచ్చుకుని బయల్దేరాడు. ఎడ్లమెళ్ళో ఘంటలు ఘల్లుమన్నాయి బళ్లు కదలగానే- వెంకడి వళ్ళు ఝల్లుమంది.

అది పశువు- వీడు పాలేరు—

౬

'అమ్మాయి గోరు! యీడనుంచి యింటిదాకా వత్తే శానా ఆలస్య మవుతుందండి. యింటికాడ నా పెళ్లాం జొరంతో బాధ పడ్తావుంది- పిల్లల్కి కాచి పోశే దిక్కు నేదు- యింటి కెల్తానండి.' అన్నాడు బండిలో కూర్చున్న అమ్మాయిగారి తోటి వెంకడు-

'సరే, పో!' అంది కరణంకూతురు. పోకండా వెంకడు చేతులు కట్టుకు నిలబడ్డాడు.

'ఏరా? వెల్లు పోసీ' అంది అమ్మాయి మళ్ళీ.

'అమ్మాయిగోరూ! యింటిదానికి పాణంమీద కొచ్చిందండి. డబ్బిత్తేనేకానీ పూజారి మందివ్వనన్నాడు. బాబుగా రిప్పుడింటి కెత్తే యిత్తానన్నారు. కాని శానా ఆలస్యమవుతుంది. తమరుగానీ దయసేయిత్తే- మీ పేరు తల్చుకుంటా- దానికి జీవా లిచ్చినో రగుతారు' అని కళ్ళనీరు తుడుచుకున్నాడు.

'తీసుకో! పాపం' అని పెట్టి తీసి రూపాయి వెంకడిచేతులోకి గిరవాటేసింది.

వెంకడికి కొండెక్కినట్లయింది ఒక్క దణ్ణంపెట్టి బండివాళ్ళను త్వరగా తోలమని చెప్పి తనూరి వైపుకి పరుగెత్తాడు. అడ్డుదారిని గట్లమీద పరుగెత్తాడు. ఎక్కడ పరుగెడు తున్నాడో- ఏమి గుచ్చుకుంటున్నాయో—ఏ మడ్డమెుస్తున్నాయో కూడా తెలియడం లేదు.

తిన్నగా పూజారి కొంపకి జేరాడు. పదిసార్లు అరిచినా తలుపు తియ్యలేదు పూజారి. ఆఖరికి విసిగి- తెగించి—గుమ్మంయెక్కి తలపు ఘట్టిగా కొట్టాడు.

కామయ్య తలుపుతీసి 'హోరి, నిన్ను నరికెయ్యా! దుర్మార్గుడా! పైకివచ్చి- తలుపుముట్టుకుని- ఛండాలుడా!' అని తిట్లు ప్రారంభించా




నూతన ఆవిష్కారం......!!

అద్భుతమైన కానుక !!......

అఖిలభారత కుష్ఠులోకానికి అందుబడిలోవుండి, ఆరోగ్యసంపద ప్రసాదింపగల

ఏకైక ఔషధం

"లెప్పర్ క్యూర్" (రిజిష్టర్డు)

ఖండాంతరవాసులు సైతం సేవించి కీర్తించారు !!

మేహ, కుష్ఠు, చర్మరోగాలు ఢుల్లగొట్టేది ఇదివక్కటే మందు...!!

బ్రాంచీలు: (1) గాంధినగరం, బెజవాడ.
(2) 144, బ్రాడ్వే, మద్రాసు.
(3) రాణీహాట్, కటకం.

లక్ష్మీ అండ్ కో, (రిజిష్టర్డు)
H.O. వాల్తేరు, ఆర్. యస్. పోస్టు.

డు. ఇంకా తిట్టేవాడే. ఎంత గోలైనా చేసేవాడే. కాని వెంకడిచేతులో తెల్లనాణెం మెరుస్తోంది. కామయ్య నోరు కట్టుబడి పోయిందంతే—

'ఏరా, ఏం?' అన్నాడు.

వెంకడు రూపాయి గుమ్మంలోకి గిరవాటేసి 'బాబయ్యా! తొరగా దయసేయించుండి. మందు. బేగే సామీ' అని వణుకుతూన్న కంఠంతో ఆత్రంతో అన్నాడు.

కామయ్య లోపలికి పోయి గ్లాసుతో నీళ్లు తీసుకువచ్చి రూపాయి మీద చల్లి దాన్ని తీసి అటూయిటూ త్రిప్పి మోగించి లోపలికెళ్లాడు— మరునిముషంలో మందు పొట్లం వెంకడిచేతులో పడ్డది—

౭

ఇంటికి పరుగెత్తాడు వెంకడు. అప్పటికి నడినెత్తిమీద కొచ్చాడు సూర్యుడు. అన్నివైపులకీ సమానంగానే— ఒకే వేడితో పడుతున్నాయి కిరణాలు—దార్లో కంసలి వీరాచారి గుమ్మంముందర గోతిలో పడ్డాడు. చేతులో పొట్లం దుమ్ములో పడిపోయింది. లేచి— చిరిగిపోయిన పంచె పీలికను మొల్లో దోపి పొట్లం దుమ్ముదులిపి— కొట్టుకుపోయిన మోచేతులూ, కాళ్లు కూడా చూసుకోకుండా మళ్లీ పరుగు ప్రారంభించాడు—

గూడెం కనిపిస్తోంది.

ఎదురుగా వీరయ్యమామ మొస్తున్నాడు— ఏదో అన్నాడు—

వినిపిస్తేనా?— వీరయ్య పట్టుకోబోయాడు— విడిపించుకుని ఆగకుండా రొజుతూ— పరుగు పెడ్తూనే వున్నాడు— వెంకడు.

ఇంటిముందు యీరయ్యమామ పెళ్లాం, మరదలు నిలబడివున్నారు. పెద్దపిల్లా దూరిక్కే ఏడుస్తున్నాడు. పిల్లని వీరయ్యపెళ్లాం ఎత్తుకునుంది. చంటాడ్ని మరదలు బుజ్జగిస్తోంది. చంకలోంచి జారిపోతున్నాడు వాడు. వెంకడ్ని చూడగానే అంతా గొల్లుమన్నారు. వెనకాలే పరుగెత్తుకొచ్చిన వీరయ్య 'పాపం!' అంటున్నాడు.

గుమ్మందగ్గిరే రత్తిశరీరం. మొహంమీద గుడ్డ తీస్తాడు వెంకడు.

'రత్తీ!'అని అరిచాడు వెంకడు. గుమ్మంప్రక్కని పడిపోయాడు. చేతులో మందుపొట్లం వెళ్లి ఎండిపోయిన గంజిగుంటలో పడింది—

కొట్టుకుపోయిన వెంకడి మోచేతినుండి రక్తబిందువు చెదరి రత్తి పెదిమలమీద పడింది.


ప్రజారోగ్య చట్టం
మద్రాసు అసెంబ్లీలో
ఆమోదాన్ని బడసింది.
అనారోగ్యంతో
—తీసుకోనేవారు—
అంటు రోగాలతో
—కుమిలేవారూ—
వెంటనే మేల్కొకపోతే
అనేక ఇక్కట్టులకు
అడ్డంకులకు
—లోనుకాబోతారు—
కాబట్టి—తక్షణం—మీమీ
అనారోగ్యసందర్భాలలో
అశ్విన్ కుమార్ ఫార్మసీ
నర్సాపురం
వారితో సంప్రతింపు చేయండి



ఆహార విజ్ఞానం
ఆర్ష గ్రంథాల్లోంచి
క్రోడీకరించి వ్రాసిన
—: ఉత్తమగ్రంథం :—
డా. ఆచంట లక్ష్మీపతిగారు
ఇంకా ఇతర ప్రముఖులు
విశేషంగా ప్రశంసించిన
ఈ గ్రంథాన్ని
వైద్యులు—వైద్యవిద్యార్థులు
ఆరోగ్యాభిలాషులు
—విధాయకంగా చదవాలి—
వెల రు. 2—0—0.
కర్త:
డాక్టర్:
మల్లాది రామమూర్తిశాస్త్రి.
పుస్తకాలయ:
వంగల అచ్యుతరామయ్య.
భీమవరం—ప. గోదావరి.